## సింగిల్ పేజీ కథలు

# క్షమయా ధరిత్రి

''ఏమండీ, ఇందాకా మా బాబాయి ఫోను చేశాడు. మా జయంతి పెళ్లంట!'' భర్తవైపు పరిశీలనగా చూస్తూ చెప్పింది సుమతి.

''జయంతి పెళ్లా!'' ఆశ్చర్యంగా అడిగాడు సుందర్.

''ఏం, ఎందుకంత ఆశ్చర్యం? జయంతి పెళ్ళంటే!'

''తనొప్పుకుందా?'' కంగారు కంగారుగా అన్నాడు.

''ఓ భేషుగ్గా, మంచి సంబంధాన్ని ఎవరు మాత్రం మిస్ చేసుకుంటారు'' ప్రశ్నించింది సుమతి.

'మోసం' మనసులో కసిగా గొణుక్కున్నాడు.

''ఏంటి, ఏదో అంటున్నారు?''


''ఏం లేదులే!'' అంటూ విసురుగా లేచిపోయాడు.

తరువాత నాలుగు రోజులు భర్త మూడీగా ఉండడం గమనించింది సుమతి. అతనెందుకలా ఉంటున్నాడో ఆమెకు తెలుసు. అది..అతనికి జయంతి మీద ఉన్న ప్రేమ అనుకుంటున్న ఆకర్షణ.

ఏదో ఇంటర్వ్యూకని వచ్చి సుమతి వాళ్లింట్లో పదిహేను రోజులు మకాం వేసింది జయంతి. సన్నగా, అందంగా నాజూగ్గా వున్న జయంతిని చూడగానే సుందర్ మనసు గతి తప్పింది. దానికి తోడు సుమతికి అబార్షనై రెండు రోజులు హాస్పిటల్‌లో ఉండాల్సి రావడం, జయంతి వంట చేసి పెట్టడం కోసం ఇంట్లో వుంటే సుందర్ ఆమెతో భోజనం పెట్టించుకుని తినాల్సి రావడం వాళ్లిద్దరి మధ్య చనువుకు దారితీసింది. దారి తప్పే సీను రాబోతుందనే సరికి సుమతి ఇంటికొచ్చేయడం సుందర్‌కి మింగుడుపడనట్టైంది.

పెళ్లయిన ఆరేళ్లకు సుమతిలో ఏదో ఆకర్షణ తగ్గినట్టనిపించింది సుందర్‌కి. జయంతి మీద మోజు పెంచుకున్నాడు.

జయంతికూడా అందగాడైన సుందర్ బావతో మాటలు, షికార్లు నచ్చాయి. అతను సుమతికి ఇంపార్టెన్స్ ఇవ్వకుండా తన మాటలకే ఎక్కువ విలువివ్వడం, తనని ఆరాధనగా చూడడం గమనించింది జయంతి. సుమతిలో లేనిదేదో తనలో ఉండబట్టే అతనికి తనంటే ఇష్టం కలిగిందనుకుంది. తన గురించి గొప్పగా ఊహించుకుని సుందర్ మనసులోని ఫీలింగ్స్‌కు తనకు తెలియకుండానే రెస్పాన్స్ ఇవ్వసాగింది.



ఒకరోజు సుమతి మార్కెట్‌కెళ్లి ఇంటికి రాగానే జయంతి భుజం మీద చేతులు వేసి మొహంలో మొహం పెట్టి నవ్వుతున్న సుందర్, అతని చేష్టలకు గిలిగింతలు పెట్టినట్టు నవ్వుతున్న జయంతి కన్పించారు. సుమతి తమనలా గమనించడం ముందు జయంతే చూసింది. కంగారు కంగారుగా అతని చేతులు తప్పించేసి రూంలోకి వెళ్ళిపోయింది.

సుందరేమో కంగారు కంగారుగా ''ఇప్పుడేనా రావడం? నేను తెచ్చేవాడ్నిగా కూరగాయలు, నాకు చెపితే!'' అని అన్నాడు.

''పరవాలేదులెండి. నాకూ ఇదో ఎక్సర్‌సైజ్‌లా వుంటుంది'' అని నవ్వుతూ అంది సుమతి.

'అమ్మయ్య, చూడలేదులే!' అని హాయిగా నిట్టూర్చాడు సుందర్.

జయంతి ఆ పూటంతా సుమతిని తప్పించుకుని తప్పించుకుని తిరిగింది. తరువాత నాలుగు రోజులకు జయంతి వాళ్ల ఊరెళ్లిపోయింది.

సుందర్‌కు బాగా నమ్మకం- జయంతి తనని ప్రేమిస్తుందని, తనకెప్పుడో ఒకప్పుడు ఫోను చేస్తుందని ఎదురుచూస్తున్నాడు. అంతలోనే జయంతి పెళ్లని సుమతి చెప్పిన వార్త అతనికి మింగుడు పడలేదు.

''మీరు కూడా వస్తారా పెళ్లికి?'' సుమతి అడిగింది భర్తని.

''నేను రాను, నువ్వెళ్లు'' విసురుగా అన్నాడు సుందర్.

నవ్వుకుంది సుమతి తన భర్తతీరుకి.

★★★

సుమతిని చూసి గబగబా ఎదురొచ్చింది జయంతి.

''అక్కా, బావను తీసుకు రాలేదుగా!'' అడిగింది భయం భయంగా వెనక్కి చూస్తూ.

''ఈ భయం ఇప్పుడు కాదు, మా ఆయనకు చనువిచ్చే ముందు ఉండాల్సింది'' అంటూ నవ్వింది సుమతి.

గతం గుర్తుకొచ్చింది. ఆరోజు సుమతి జయంతి రూంలోకొచ్చింది. భయంగా లేచి నిలబడింది జయంతి. బావ తన భుజం మీద చేతులు వేసి మాట్లాడటం చూసిందిగా, అడగడానికొచ్చిందని తెలిసిపోయింది. ''నాకేం తెలియదు, బావే...'' అని బుకాయిద్దామనుకుంది.

అంతలో సుమతి-''నువ్వు మీ ఊరెప్పుడెళుతున్నావ్?'' అనడిగింది.

''అక్కా!''

''ఇక నువ్వేం చెప్పకు. నేనంతా చూసాను. ఆ విషయం గురించి నేను నిన్నడిగినా, మా ఆయన్నడిగినా మీరు 'కథలు' చెపుతారు. ఆ కథలు చెప్పడం వల్ల మీకేం లాభం వుండదు. ఈ గేమ్‌లో ఎప్పటికైనా నష్టపోయేది నువ్వే! రుచి మరిగిన మగాడు కన్నెపిల్లను వదులుకోవడానికిష్టపడడు. అలా అని నిన్ను మా ఆయనేం పెళ్లి చేసుకోడు. పోనీ, నువ్వడిగి చూడు 'నీ భార్యను, పిల్లల్ని వదిలేసి నన్ను పెళ్లి చేసుకో బావా' అని. తనొప్పుకోడు. ఆ రిస్క్ మగాడెప్పుడూ తీసుకోడు. నిన్ను సైడున 'కీప్'గా ఉంచుకుంటాను అంటాడు, అలా ఉంటావా?''

''అక్కా!'' రోషంగా అరిచింది జయంతి.

''ఈరోజు నేనొక్కదాన్ని నిన్ను 'కీప్' అంటే నీకింత రోషం వచ్చిందే. రేపు ఇంకా ఎంతమంది అంటుంటే నువ్వు భరించాలో. ఒకసారి నువ్వు మా ఆయనకి లొంగిపోతే జీవితాంతం నీకా ముద్ర తప్పదు తెలుసా?''

''అక్కా, నన్ను క్షమించక్కా, నన్ను... నన్ను ఈ ఆపద నుండి తప్పించక్కా!'' అంటూ కళ్లనీళ్లతో వేడుకుంది జయంతి.

''మీ నాన్నకి ఉత్తరం వ్రాస్తాను. మంచి సంబంధమొకటి నా దృష్టిలో వుంది, చేసేసుకో! నీ విషయాలేవీ బావకు తెలియనివ్వకు. అసలిక్కడకు నీ పెళ్లయ్యేదాకా రాకు!'' అని చెప్పింది సుమతి.

''ఏంటలా ఉండిపోయావ్!'' జయంతిని కుదుపుతూ అంది సుమతి.

''బావనీ విషయం అడిగావా?'' తలవంచుకుని అడిగింది.

''ఎందుకు? నాకు తెలిసింది కాబట్టి ఇదడుగుతాను. తెలియక ఇంకెన్నో!''

''నీకీ ఓర్పు ఎలా వచ్చిందక్కా!''

''ఆ దేవుడిచ్చాడు'' చేతులు పైకెత్తి చూపిస్తూ అని లోపలికెళ్లిపోయింది.


'క్షమయా ధరిత్రి!' అని స్త్రీని ఎందుకంటారో అప్పుడర్థమైంది జయంతికి. ముందు ముందు ఈ పాఠం తనకెలా పనికొస్తుందోనని ఆలోచిస్తూ ఉండిపోయింది.

**-కె. లలితారాజ్** (ఒంగోలు)

# మార్పు

గురువారం కనుక సాయిబాబా గుడి రష్‌గా వుంది. జయంత్ దైవదర్శనం చేసుకుని ఆఫీసుకు బయల్దేరాడు. కొంతదూరం రాగానే అతని దృష్టి ఆ అమ్మాయిపై పడింది. చాలా అందంగా ఉందా అమ్మాయి. భుజానికి హేండ్‌బ్యాగ్ తగిలించుకొని వడివడిగా నడుస్తూంది.

బహుశ ఆఫీసుకో, కాలేజీకో టైము అయిపోతున్నది కాబోలు. గుడి ఊరికి రెండుమైళ్ళ దూరంలో ఉంది. ఆటోలు దొరకవు. ముందే ఇంటి దగ్గర మాట్లాడుకొని రావాలి. టౌను బస్సు యింకా ఆ రూటులో వేయలేదు. భక్తులకు యిబ్బందే అయినా భగవంతుణ్ణి చూడాలనుకొనేవారు ఆ మాత్రమైనా కష్టపడకపోతే ఎలా?



ఆలోచనల్నుంచి తేరుకొని ఆమె వైపు చూశాడు. ఎండలో వేగంగా నడవటం వల్ల చెమటలు పడుతుంటే చేతిరుమాలుతో తుడుచుకొంటూనే నడవసాగింది. ఆమె అవస్థ చూసి జయంత్‌కి జాలేసింది. బైక్‌ను ఆమె ప్రక్కన ఆపి ''నేను టౌన్ వైపే వెళ్తున్నాను. మీకు లిఫ్టు కావాలంటే రండి'' అని అడిగాడు.

ముందు అతని వైపు కోపంగా చూసిందామె. తర్వాత వెనుకకు చూసి దూరంగా వస్తున్న ఓ ముసలావిడను చూపిస్తూ ''మీది అంత జాలి గుండైతే ఆ ముసలావిడకు లిఫ్టివ్వండి. మీకు పుణ్యమూ వస్తుంది. మీ చెంప జాగ్రత్తగానూ ఉంటుంది'' అని తిరిగి వేగంగా నడవసాగింది.

చాలా అవమానంగా ఫీలయ్యాడు జయంత్.

అసలు తను యిలా ఒక ఆడపిల్లను 'లిఫ్ట్ కావాలా' అని అడగడమే తన జీవితంలో మొదటిసారి. ఆమె అవస్థ చూసి సాటి మనిషిగా సహాయం చేద్దామని అడిగాడేగాని మరో దురుద్దేశం లేదు తనకు. తన సాయం అక్కర్లేదనుకొంటే ఏదో ఒకటి మర్యాదగా చెప్పి తప్పించుకోవచ్చు కదా. ఇంత అందమైన ముఖానికి అంత కఠినమైన మనస్సు ఎందుకిచ్చాడో ఆ భగవంతుడు.

మోటార్ బైక్‌ను స్టార్ట్ చేస్తూ అనుకున్నాడు జయంత్.

★ ★ ★

తల్లి నిద్ర లేపితే మెలకువ వచ్చింది నిర్మలకి. అక్కకు నొప్పులు మొదలయినాయట. తండ్రి క్యాంపుకెళ్ళాడు. ఇంట్లో ముగ్గురూ ఆడవాళ్ళే. సమయం రాత్రి పదకొండున్నరయింది. ఏమి చేయాలో తోచలేదు నిర్మలకు. అక్క కాన్పు దగ్గరకొచ్చినా లీవు పెట్టని తండ్రిమీద, ఫోన్‌కు అప్లయి చేసి సంవత్సరమైనా యింకా యివ్వని టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ మీదా కోపం వచ్చింది నిర్మలకు.

''అమ్మా, ప్రక్కనున్న ఎస్.టి.డి బూత్‌కెళ్ళి రమ వాళ్ళ అన్నయ్యను రమ్మంటాను. నీవు అక్కను చూస్తూండు'' చెప్పులేసుకొంటూ అంది.

''ఇంత అర్ధరాత్రి బయటికి ఎలా వెళ్తావే?''

తల్లి ప్రశ్నని పట్టించుకోకుండా నాలుగిళ్ళకవతల వున్న ఎస్.టి.డి బూత్‌లో అడుగుపెట్టి కౌంటర్ ముందున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయింది. అతను గుడి దగ్గర లిఫ్టు కావాలా అని అడిగినతను.

''ఏమిటి.. ఇంతరాత్రి..'' ఆశ్చర్యంగా అడిగాడు జయంత్.

''మా అక్కకు పెయిన్స్'' ఆందోళన వల్ల ఆమెకు ఏడుపు వచ్చేసింది.

''మరేం ఫర్వాలేదు. డోంట్ వర్రీ. ఏ హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి? మీ యిల్లెక్కడుంది?'' అనునయిస్తూ అడిగాడు. ఆమె చెప్పింది. జయంత్ వెంటనే తన ఫ్రెండ్‌కు ఫోన్ చేశాడు.

ఐదు నిమిషాల్లో కారు వచ్చింది. జయంత్ షాపు లాక్ చేసుకొని వాళ్ళకు తోడుగా హాస్పిటల్‌కు వెళ్ళాడు. నిర్మల అక్క ఉదయం నాలుగు గంటలకు ప్రసవించింది. అంతవరకూ తనతోనే ఉండి ధైర్యం చెప్పిన జయంత్‌కి థ్యాంక్స్ చెప్పి గుడి దగ్గర తన ప్రవర్తనకు క్షమాపణ చెప్పింది.

''ఫర్వాలేదండి. ఆ షాపు మా ఫ్రెండ్‌ది. వాడు వూరెళ్తూ ఈరోజు నన్ను చూసుకోమన్నాడు. అయితే నేనే కాదు అక్కడ ఎవరున్నా మీకు సహాయం చేసేవారు.''

''వాళ్ళు చేయడం సహజమే. కానీ, మిమ్మల్ని నొప్పించినా నాకు సహాయం చేశారు. మీ ప్రవర్తనతో నాలో పరివర్తన తెచ్చారు. ఇకనుంచీ నేను ఎవరితోనూ పరుషంగా మాట్లాడి వాళ్ళ మనసు నొప్పించనని మీకు మాట ఇస్తున్నాను'' అంది నిర్మల.

''వెరీగుడ్. సమాజంలో ఎదుటి మనిషి ఫీలింగ్స్‌ని పట్టించుకోనేవాళ్ళే కరువవుతున్నారు. కనీసం మనలాంటి చదువుకొన్నవాళ్ళయినా అలాకాకుండా ఉండాలి'' సంతోషంగా అన్నాడు జయంత్.

**-సి.ఎన్.చంద్రశేఖర్ (చిత్తూరు)**